సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.24

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.25, కనిష్టంగా రూ.14 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 2,850 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
33.1°/20.4°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

పనులు లేక పస్తులు!



ఇతని పేరు శివానంద. పుట్టపర్తి మండలంలోని బొంతలపల్లి. సొంతంగా పొలం లేదు. గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కానీ ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవకపోవడంతో వ్యవసాయ పనులు కూడా లేవు. దీంతో తల్లితో కలిసి ఉపాధి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల కాలంలో పనులు చేసినా బిల్లులు ఖాతాలో జమ కాలేదు. పైగా ఇప్పుడు పనులు కూడా చూపించడం లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బెంగళూరుకు కుటుంబంతో సహా వలస వెళ్లేందుకు శివానంద సిద్ధమయ్యాడు.

...ఇలాంటి వారు జిల్లాలో వేలాది మంది ఉన్నారు. బిల్లులు భారీగా పేరుకుపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. అదునులో వర్షాలు కురవకపోవడంతో ప్రస్తుతం వ్యవసాయ పనులు కూడా దొరకడం లేదు. ఈ పరిస్థితుల్లో చాలా మంది పస్తుండలేక పొట్టచేతబట్టుకుని వలసబాటపట్టారు.

జిల్లాలో నిలిచిన 'ఉపాధి' పనులు

- రూ.కోట్లలో పేరుకుపోయిన బిల్లులు
- పనులు అడిగినా కల్పించని అధికారులు
- వ్యవసాయ పనులు లేక దుర్భరంగా జీవనం
- వలస బాట పడుతున్న కూలీలు



ఓడీసీ వద్ద చెరువు పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

2.17 లక్షలు
జిల్లాలోని జాబ్ కార్డుల సంఖ్య

3.83 లక్షలు
ఉపాధి పనులకు వెళ్లే కూలీలు

1,080 మంది
ప్రస్తుతం పనులు చేస్తున్న కూలీలు

రూ.**66** కోట్లు
పెండింగ్‌లో ఉన్న బిల్లుల మొత్తం

పుట్టపర్తి అర్బన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లాలో నిర్వీర్యమైంది. అధికారులు పట్టించుకోక...పాలకులు స్పందించక 'ఉపాధి' లక్ష్యం నీరుగారింది. ఇప్పటికే బిల్లులు పేరుకుపోగా కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పనిచేద్దామన్నా అధికారులు పనులు కల్పించడం లేదు. దీంతో చాలా కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది.

వెయ్యికి పడిపోయిన కూలీల సంఖ్య..

జిల్లాలో 2.17 లక్షల జాబ్ కార్డులుండగా ఆయా కార్డుల్లో 3.83 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. రోజూ సుమారు 80 వేల మంది ఉపాధి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పనులు కల్పించక పోవడం, బిల్లులు పెండింగ్ పెట్టడంతో పనులకు వెళ్లే కూలీల సంఖ్య ప్రస్తుతం 1,080 పడిపోయింది. పోనీ వ్యవసాయ పనులైనా చేసుకుందామనుకుంటే సకాలంలో వర్షాలు కురవక పోవడంతో జిల్లాలో 1.5 లక్షల ఎకరాలు బీళ్లుగా ఉన్నాయి. దీంతో ఇటు వ్యవసాయ పనులు లేక, అటు ఉపాధి పనులు లేక పోవడంతో ఇల్లు గడిచేది ఎలా కూలీలు మదనపడుతున్నారు. చాలా మంది బెంగళూరు, హైదరాబాద్, కేరళ తదితర ప్రాంతాలకు వలస వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. దసరాలోపు బిల్లులు చెల్లించకపోతే పండుగ తర్వాత పల్లెలన్నీ వలసబాట పట్టనున్నాయి.

బిల్లులు భారీగా పెండింగ్..

ప్రస్తుతం జిల్లా కూలీలకు రూ. 66 కోట్లు బిల్లులు రావాల్సి ఉంది. దీంతో కూలీలు రోజూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వాస్తవానికి ఉపాధి పనులకు వెళ్తే రోజువారీగా రూ.250 నుంచి 300 కూలీ వస్తుంది. అయితే సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో కూలీలు పనులకు వెళ్లడం లేదు.

పనులు చేయకపోయినా బిల్లులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీ పథకంలో అవినీతి పెరిగింది. కూటమి నాయకులు, ఉపాధి హామీ అధికారులతో కలిసి మాయాజాలం చేస్తున్నారు. పనులకు రాని కూలీల జాబ్ కార్డులు తీసుకొని పనులకు వెళ్లినట్లు సృష్టించి బిల్లులు కాజేస్తున్నారు. ప్రతి మండలంలో కనీసం వెయ్యి మందికి దొంగ బిల్లులు పెట్టి నిధులు కాజేస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు సగం బిల్లు ఇచ్చి..మిగతాది స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కొన్ని మండలాల్లో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధుల పేర్లతో బిల్లులు చేసుకున్నట్లు తెలుస్తోంది.

పనులు కల్పించలేదు



ఏడాదిలో 200 రోజులు 'ఉపాధి పనులు' కల్పించాలని ప్రభుత్వం చెబుతోంది. కానీ అధికారులు పనులు కల్పించడం లేదు. స్థానికంగా వ్యవసాయ పనులు లేవు. దీంతో పశువులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నా. కూలీల కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి.

– లక్ష్మీపతి, సుబ్బరాయనిపల్లి

బయోమెట్రిక్ విధానం అమలు



ఉపాధి పనుల్లో అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం బయోమెట్రిక్ విధానాన్ని తీసుకువస్తోంది. బిల్లుల పెండింగ్ విషయం వాస్తవమే. అయితే గతంలో రూ.77.47 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉండగా, విడతల వారీగా చెల్లిస్తూ వచ్చాం. ప్రస్తుతం రూ.66 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గత వారంలో కూలీల ఖాతాల్లో నగదు జమ అయ్యింది. వచ్చే వారంలో బిల్లులన్నీ మంజూరవుతాయని ఆశిస్తున్నా. ఇప్పటికే అన్ని వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. అడిగిన వారందరికీ పనులు కల్పిస్తాం.

– విజయ్ ప్రసాద్, పీడీ, డ్వామా

న్యూస్‌రీల్

అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తాం

- ఎస్పీ సతీష్‌కుమార్



పరిగి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పరిగి/పెనుకొండ/సోమందేపల్లి: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తామని ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన పరిగి, సోమందేపల్లి పోలీసు స్టేషన్లతో పాటు పెనుకొండ సీఐ కార్యాలయాన్ని ఆకస్మింగా తనిఖీ చేశారు. కంట్రోల్ రూం, సీసీ కెమెరాల పనితీరును సీఐ రాఘవన్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా స్టేషన్లలోని పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులు..దర్యాప్తు తీరు తెలుసుకున్నారు. నేరస్తుల జాబితాను పరిశీలించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించే వారు ఎవరైనా కఠినంగా వ్యవహరించాలన్నారు. స్టేషన్‌కు వచ్చి ఎవరు ఫిర్యాదు చేసినా తప్పకుండా కేసు నమోదు చేయాలన్నారు. అలాగే గతంలో ఘర్షణలు, గొడవలు చోటుచేసుకున్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చిన్నారులు, మహిళలపై నేరాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ మహిళా పోలీసుల ద్వారా ఆయా గ్రామాల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెసుకుంటూ ఉండాలని అధికారులను ఆదేశించారు.

సహకారం అవసరం

అనంతరం ఎస్పీ ఆయా పోలీసుస్టేషన్ల వద్ద విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణా, పేకాట, మట్కా తదితర అసాంఘిక చర్యలకు పాల్పడే వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో మీడియా, ప్రజలు పోలీసులకు సహరించాలని కోరారు. ఎస్పీ వెంట పెనుకొండ సీఐ రాఘవన్ ఉన్నారు.

అక్టోబరులో 'సర్'

- ప్రతి ఇంటినీ సందర్శించి ఓటరు జాబితా సిద్ధం చేయాలి
- జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

హిందూపురం: భారత ఎన్నికల కమిషన్ పేర్కొన్న మార్గదర్శకాలు మేరకు షెడ్యూల్ ప్రకారం జిల్లాలో ఓటరు జాబితాపై అక్టోబర్ నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్ – సర్) నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్, హిందూపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి అభిషేక్‌కుమార్ వెల్లడించారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రక్రియపై బుధవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కూ బూత్ లెవెల్ ఏజెంట్లను రాజకీయ పార్టీలు నియమించాల్సి ఉంటుందన్నారు. బూత్ లెవెల్ అధికారులు తమ పరిధిలోని వార్డుల్లో ప్రతి ఇంటినీ సందర్శించి ఓటరు జాబితాను సిద్ధం చేయాల్సి ఉంటుందన్నారు. సర్వేలో బూత్ లెవెల్ ఏజెంట్లు తప్పని సరిగా పాల్గొనాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు వెంకటేష్, సౌజన్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్, ఆర్ఐ అమరేంద్ర, ఎన్నికల సిబ్బంది, నియోజకవర్గ ఎన్నికల సూపర్‌వైజర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రెక్కలు విరిగిన పూలు

- పడిపోయిన ధరలతో రోడ్డు పక్కన పారబోత



సేవామందిరం-హిందూపురం వంతెన కింద పారబోసిన బంతిపూలు

పరిగి: బంతి పూల ధర అమాంతం పడిపోయాయి. కనీసం రవాణా చార్జీలు కూడా దక్కని పరిస్థితుల్లో రైతులు రోడ్డు పక్కన పారబోస్తున్నారు. తాజాగా బుధవారం ఓ రైతు బంతిపూలను హిందూపురం మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధమయ్యాడు. కానీ మార్గమధ్యంలోనే ఆయనకు పూల ధర గురించి తెలిసింది. హిందూపురం వెళ్లినా ట్రక్కు రవాణా చార్జీ కూడా దక్కే పరిస్థితి లేకపోవడంతో పరిగి మండలంలోని సేవామందిరం – హిందూపురం వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న వంతెన వద్ద వాహనం నిలిపి బంతిపూలను పారపోసి వెళ్లిపోయాడు. కిలో కనీసం రూ.50 అయినా పలుకుతాయనుకుంటే బుధవారం రూ.10 కూడా పలకని పరిస్థితుల్లో రైతు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా రైతు పారబోసిన బంతి పూలను స్థానికులు బ్యాగ్‌లలో, కవర్‌లలో నింపుకుని వెళ్లడం గమనార్హం.

రైల్వే కార్మికులకు 78 రోజుల బోనస్

గుంతకల్లు: రైల్వే కార్మికులకు కేంద్రం శుభవార్త చెప్పింది. దసరా పండగ సందర్భంగా 78 రోజుల వేతనానికి సమానమైన ప్రొడక్టివిటీ లింక్డ్ బోనస్ కార్మికులకు చెల్లిస్తామని ప్రకటించింది. ఈ మేరకు సమాచారం అందినట్లు డివిజన్ అధికారులు తెలిపారు. దీంతో గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా ఉన్న దాదాపు 14,500 మంది కార్మికులకు సుమారు రూ.24 కోట్లు మంజూరు కానున్నాయి. ఒక్కో కార్మికుని బోనస్ రూపంలో రూ.17,951 మేర ఖాతాల్లో జమ కానుంది.

సత్యసాయి కీర్తి శోభిల్లాలి

- శత జయంత్యుత్సవాలు వైభవంగా చేద్దాం
- అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ పిలుపు
- సత్యసాయి శత జయంతి వేడుకల నిర్వహణపై సమీక్ష



సత్యసాయి శతజయంత్యుత్సవాల నిర్వహణపై సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్

ప్రశాంతి నిలయం: ''సత్యసాయి శత జయంతి వేడుకలను ప్రతిష్టాత్మకంగా తీసుకుందాం. వేడుకలకు దేశవిదేశాల నుంచి భక్తులు వస్తారు. ఒక్క భక్తుడికి కూడా ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేద్దాం. మన ఆతిథ్యంతో సత్యసాయి కీర్తిని అంతర్జాతీయంగా శోభిల్లేలా చేద్దాం'' అని కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ అధికారులకు పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్సు హాలులో సత్యసాయి శత జయంతి వేడుకల నిర్వహణపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సత్యసాయి శతజయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని, దేశం గర్వించేలా వేడుకలను నిర్వహించాలన్నారు. రోజువారీ భక్తుల రాకపోకలను ఎప్పటికప్పుడు అంచనా వేసి అవసరమైన ఏర్పాట్లు చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా భక్తులు తరలివస్తారని, అందుకు తగ్గట్టుగా రవాణా, వసతి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తాగునీరు, శానిటేషన్, మొబైల్ టాయిలెట్లు, వీధి దీపాలు, డస్ట్ బిన్లు, వ్యర్థాల నిర్వహణ, ఫుడ్ కౌంటర్లు, అదనపు సిబ్బంది నియామకం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మున్సిపాలిటీ, పంచాయతీల సిబ్బందిని షిఫ్టుల వారీగా 24 గంటల పాటు విధులు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. రోడ్ల మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పర్యావరణ హితంగా ఉత్సవాలు నిర్వహించాలన్నారు.

నిరంతర నిఘా... పటిష్ట భద్రత ..

ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ, సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు పటిష్ట భద్రత కల్పిస్తామన్నారు. నిరంతర నిఘా ఉండేలా అత్యాధిక డ్రోన్లు, ఇతర పరికరాలు ఉపయోగించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అత్యవసర వాహనాలు, సీసీ కెమెరాలు, డ్రోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. కమ్యూనికేషన్ కోసం రిపీటర్ స్టేషన్, పార్కింగ్ ప్రాంతాల్లో కెమెరాలు, సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎప్పుడు ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో స్పందించేలా సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సత్యసాయి జయంతి వేడుకల ఏర్పాట్ల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సమీక్షలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగానికి పిలిచి.. లేదన్నారు!

- అర్హత సాధించి.. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థికి నో చాన్స్

హిందూపురం టౌన్: డీఎస్సీలో అర్హత సాధించినా.. నియామక పత్రం అందే వరకూ ఉద్యోగంపై ఆశ పెట్టుకోవద్దని మరోసారి రుజువైంది. ఇంతకీ ఏం జరిగిందంటే...బుక్కపట్నం మండలానికి చెందిన వరలక్ష్మి ప్రస్తుతం హిందూపురంలో నివాసం ఉంటున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షలో ఆమె ఆంగ్ల సబ్జెక్ట్ స్కూల్ అసిస్టెంట్‌లో 101వ ర్యాంకు సాధించారు. ఎంపిక జాబితాలో 85 నంబర్‌లో ఉన్నారు. ఆమెను ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపిక చేసినట్లు విద్యాశాఖ అధికారులు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఆమె సర్టిఫికెట్లు కూడా పరిశీలించారు. అమరావతిలో నియామక ఉత్తర్వులు తీసుకునేందుకు ఈనెల 18వ తేదీన బయలుదేరారు. అయితే కార్యక్రమం వాయిదా పడటంతో తిరిగి ఇంటికి వచ్చారు. నియామక ఉత్తర్వులు ఇచ్చేందుకు అమరావతిలో గురువారం అధికారులు కార్యక్రమం ఏర్పాటు చేయగా...



విజయవాడ వెళ్లేందుకు సిద్ధమై వచ్చిన వరలక్ష్మి

బుధవారం జిల్లాకు చెందిన అభ్యర్థులంతా బయలుదేరి వెళ్లారు. అయితే వరలక్ష్మికి మంగళవారం రాత్రి అనంతపురం డీఈఓ వరప్రసాద్ ఫోన్ చేసి.. జాబితాలో పేరు లేదని చెప్పడంతో ఆమె కంగుతిన్నారు. అర్హత సాధించినప్పటికీ తనకు ఉద్యోగం ఎందుకు ఇవ్వడం లేదంటూ బోరున విలపించారు. అయినప్పటికీ ఆ అంశం తమ పరిధిలో లేదని అధికారులు చేతులెత్తేశారు.

చివరి నిమిషంలో పేరు మార్చారు

నేను 2025 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్‌కు సెలెక్ట్ అయ్యాను. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తయ్యింది. నియామక పత్రం అందుకునేందుకు సిద్ధం కాగా... మంగళవారం రాత్రి 8:30 సమయంలో డీఈఓ ఫోన్ చేసి లిస్ట్‌లో మీ పేరు లేదని చెప్పారు. ర్యాంకులో మీకంటే ముందున్న ఆంజనేయులు అనే అభ్యర్థికి ఉద్యోగం ఇచ్చామని చెప్పారు. నేను టీజీటీలో 250 ర్యాంకు సాధించాను. ఆ ర్యాంకు ప్రకారం జోన్ -4లో తీసుకున్నప్పటికీ టాప్ లిస్టులో రెండో స్థానంలో 250 ర్యాంకుతో టీజీటీ పోస్టుకు అర్హత ఉంది. అందులో ఉద్యోగం ఇవ్వాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదు. నాకంటే తక్కువ ర్యాంకు సాధించిన వారికీ ఉద్యోగం ఇచ్చారు. కానీ టీజీటీలో నాకు 250 ర్యాంకు వచ్చినా అనర్హురాలిగా ప్రకటించారు. కనీసం టీజీటీలోనైనా ఉద్యోగం ఇవ్వాలి.

– వరలక్ష్మి

క్లుప్తంగా

అమరావతికి తరలిన డీఎస్సీ అభ్యర్థులు



బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్‌: ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ–25కు ఎంపికైన అభ్యర్థులు బుధవారం ఉదయం అమరావతికి తరలి వెళ్లారు. జిల్లాతో పాటు జోనల్‌ పోస్టులకూ ఎంపికైన వారితో పాటు సంబంధీకులు ఒకరు తోడుగా ఉన్నారు. ఉదయాన్నే అనంతపురం రూరల్‌ మండలం ఆలమూరు రోడ్డులోని బాలాజీ పీజీ కళాశాల వద్ద అల్పాహారం ముగించుకుని మొత్తం 45 బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. బస్సులకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. గురువారం అమరావతిలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి చేతులమీదుగా నియామక పత్రాలు అందుకుంటారని డీఈఓ తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్లు మునీర్‌ఖాన్‌, శ్రీనివాసులు, డెప్యూటీ డీఈఓలు శ్రీనివాసులు, మల్లారెడ్డి, ఎంఈఓలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం

- రికార్డుల్లో లేకున్నా రైతు పొలంలో రస్తా

కుందుర్పి: జంబుగుంపల గ్రామంలో టీడీపీ నేతలు చెలరేగిపోయారు. వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్నారనే అక్కసుతో రైతుల పొలాల్లో దౌర్జన్యంగా రస్తా వేసేందుకు ఉపక్రమించారు. అడ్డుకోబోయిన మహిళలను బెదిరించడంతో బాధితులు నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. జంబుగుంపల గ్రామంలోని సర్వే నంబర్‌ 110లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు రైతులు దొడ్డయ్య, ఎర్రమల్ల తదితరులకు చెందిన భూమి ఉంది. బుధవారం సాయంత్రం టీడీపీ నాయకుల ప్రమేయంతో తహసీల్దార్‌ ఓబులేసు, సిబ్బంది అక్కడకు చేరుకుని ఆ భూమిలో ప్రభుత్వ శివాయి జమ భూమి కూడా ఉందని రస్తా వదలకపోతే స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వ భూమిని వదిలేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే ఇదే సర్వే నంబర్‌లో పట్టా భూమి కూడా ఉందని, అందులో రస్తా వదిలేందుకు సాధ్యం కాదని అన్నారు. ఆ సమయంలో ఎందుకు సాధ్యం కాదంటూ టీడీపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. రెవెన్యూ అధికారులను ఉసిగొల్పి సర్వే చేయించారు. అడ్డుకోబోయిన లక్ష్మి, నాగలక్ష్మిని రెవెన్యూ అధికారుల సమక్షంలోనే చితకబాదారు. జేసీబీని రప్పించి రస్తా ఏర్పాటుకు భూమి చదును పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న వాల్మీకి కార్పొరేషన్‌ మాజీ డైరెక్టర్‌ పాలాక్షి, గ్రామ సర్పంచ్‌ గంగాధర, వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకుడు మహేంద్ర, ఎస్సీ సెల్‌ డివిజన్‌ అధ్యక్షుడు తిప్పేస్వామి, మాజీ డీలర్‌ నాగరాజు బాధితులకు అండగా నిలిచారు. పట్టా భూముల్లో రస్తా లేకున్నా.. టీడీపీ నాయకుల మాటలకు తలొగ్గి అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం సబబు కాదని హితవు పలికారు.

విద్యుత్‌ భారం రెండింతలు!

- ట్రూఅప్‌, సర్‌ చార్జీల పేరుతో ఇప్పటికే తడిసి మోపెడు
- తాజాగా కొత్త మీటర్‌ మంజూరుపై బాదుడే బాదుడు
- అన్ని కేటగిరీలకూ ధరలు పెంచిన కూటమి సర్కారు



పుట్టపర్తి టౌన్‌: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కరెంట్‌ బిల్లులు వినియోగదారులకు షాక్‌ కొడుతున్నాయి. ట్రూఅప్‌ చార్జీలు, సర్‌ చార్జీల పేరుతో దశల వారీగా విద్యుత్‌ వినియోగంపై భారీగా వడ్డనలు విధించిన ప్రభుత్వం... తాజాగా పేదలపై మరో బాదుడు మొదలు పెట్టింది. ఇకపై కొత్త మీటర్‌ కావాలంటే గతంలో ఉన్న ధరకు రెట్టింపు చలానా రూపంలో చెల్లించాల్సి వస్తోంది. అన్ని కేటగిరి మీటర్ల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో కొత్త మీటర్‌ కొనాలంటే పేదలు భయపడే పరిస్థితి నెలకొంది. అధిక ధర చెల్లించి ఆన్‌లైన్‌లో మీటర్‌ బుక్‌ చేస్తే మీటర్లు సకాలంలో అందక చలానాను రద్దు చేసుకోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో మళ్లీ నూతనంగా బుక్‌ చేసుకోక తప్పడం లేదు. ఈ క్రమంలోనే మరమ్మతు చేసిన పాత మీటర్లనే అంటగట్టి సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారింది.

పెరిగిన విద్యుత్‌ మీటర్ల ధరలు..

పుట్టపర్తి సబ్‌ డివిజన్‌ పరిధిలోని బుక్కపట్నం, గోరంట్ల, కొత్తచెరువు, పుట్టపర్తి టౌన్‌, పుట్టపర్తి రూరల్‌ మండలాల్లో కేటగిరి –1 కింద 70,145 గృహ వినియోగ విద్యుత్‌ కనెక్షన్లు, కేటగిరి 2 కింద 6,821 వాణిజ్య పరమైన కనెక్షన్లు, కేటగిరి 3 కింద 367 పారిశ్రామిక కనెక్షన్లు, కేటగిరి 4 కింద 1,785 వీధి లైట్లు, కేటగిరి –5 కింద 17, 521 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. కేటగిరి 1 కింద గతంలో విద్యుత్‌ మీటర్‌ కోసం రూ.1,800 చెల్లించేవారు. ప్రస్తుతం దీని ధ రూ.4,210కు చేరుకుంది. అలాగే కేటగిరి–2 మీటర్‌ ధర గతంలో రూ.2,700 ఉండగా ప్రస్తుతం రూ.5,600 వసూలు చేస్తున్నారు. ఇక పరిశ్రమల్లో వినియోగానికి అనుగుణంగా మీటర్ల ధరలు వర్తిస్తాయి. ఇప్పటికే మీటర్ల కోసం దరఖాస్తు చేసుకున్న చాలా మంది కొత్త ధరలు అమల్లోకి రావడంతో ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

మోయలేని భారం



పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు కొత్తగా విద్యుత్‌ మీటర్‌ కొనలేని పరిస్థితి. ఇప్పటికే కరెంట్‌ బిల్లులు భారీగా పెంచారు. ప్రతి నెలా కరెంట్‌ బిల్లులు కట్టేందుకు పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు మీటర్ల ధరలు పెంచారు. ఇది ప్రజలపై మోయలేని భారం. ఎన్నికల్లో సమయంలో కరెంట్‌ బిల్లులు పెంచబోమని చెప్పిన కూటమి పెద్దలు ఇలా మాట తప్పడం మంచిది కాదు. – రవినాయక్‌, పుట్టపర్తి

పునరాలోచించాలి



కరెంట్‌ బిల్లుల అమాంతంగా పెరిగి పోవడంతో పేదలపై ఆర్థిక భారం పడుతోంది. దీనికి తోడు మీటర్ల ధరలు రెట్టింపునకు పైగా ప్రభుత్వం పెంచి కొత్తగా ఇల్లు కట్టుకునే వారి నడ్డి విరుస్తోంది. పెంచిన ధరలపై ప్రభుత్వం పునరాలోచించాలి. లేకపోతే ఉద్యమాలు తప్పవు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం విద్యుత్‌ బిల్లల భారం తగ్గించాలి. – గంగాద్రి, సీపీఎం మండల కార్యదర్శి, పుట్టపర్తి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- కలెక్టర్‌ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ పిలుపు



వృద్ధురాలితో కలిసి మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్‌ శ్యాం ప్రసాద్‌

ప్రశాంతి నిలయం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కలెక్టర్‌ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ పిలుపునిచ్చారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి బుధవారం కలెక్టర్‌ కొత్తచెరువు మండలం జానకిరామయ్య కాలనీలో అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ...జిల్లాలో విరివిగా మొక్కలు నాటడంతో పాటు, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వృద్ధురాలు వెంకటలక్ష్మమ్మ భూమిలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ ప్రాంతానికి 'వెంకట లక్ష్మమ్మ తోట'గా నామకరణం చేశారు. కార్యక్రమంలో సోషల్‌ ఫారెస్ట్రీ డీఎఫ్‌ఓ శ్రీనివాసులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఇన్‌చార్జ్‌ పీడీ శ్రీలక్ష్మి, ఏపీడీ జ్యోతి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ నటరాజ్‌, ప్లాంటేషన్‌ మేనేజర్‌ వెంకటప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ సౌభాగ్యం

కుటుంబానికి వెన్నెముకగా నిలిచే మహిళ ఆరోగ్యంగా ఉంటేనే..ఆ కుటుంబం సుఖ సంతోషాలతో ఉంటుందని కలెక్టర్‌ శ్యాం ప్రసాద్‌ అన్నారు. 'స్వస్థ్‌ నారి– సశక్త్‌ పరివార్‌ అభియాన్‌' కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తచెరువు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'స్వస్థ్‌ నారి– సశక్త్‌ పరివార్‌ అభియాన్‌' కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహించి మహిళలు వివిధ రకాల పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన మందులనూ అందిస్తారన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ పలువురు వృద్ధులతో మాట్లాడి వారి ఆరోగ్య స్థితి గతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఫైరోజా బేగం, డీసీహెచ్‌ఎస్‌ మధుసూదన్‌, వైద్యులు అశ్వర్థకుమార్‌, జోయల్‌ వెస్లీ, భార్గవ్‌, వరలక్ష్మి, హారిక, జయశ్రీ, ఎంపీడీఓ నటరాజ్‌, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించండి

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్‌ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ ఆదేశించారు. జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమీక్షా సమావేశం బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌ హాల్‌లో జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్‌ మాట్లాడుతూ.. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగు పెట్టాలనుకునే వారికి ఆర్థిక చేయూతను అందించేలా బ్యాంకర్లను సమన్వయం చేస్తామన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, జిల్లా ఫ్యాక్టరీల అధికారి రాధాకృష్ణ, ఏపీఐఐసీ, విద్యుత్‌ అధికారులు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు.

విరివిగా రుణాలు అందించాలి

జిల్లా ఆర్థిక ప్రగతికి విరివిగా రుణాలు అందించాలని బ్యాంకర్లకు కలెక్టర్‌ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ సూచించారు. జిల్లాలోని బ్యాంకర్లు, ఇతర అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌ హాల్‌లో డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమీక్ష నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.14051 కోట్ల రుణాలు అందజేయాలని లక్ష్యం కాగా, జూన్‌ 30తో ముగిసిన మొదటి త్రైమాసికానికి రూ.5646.37 కోట్ల రుణాలు మంజూరు చేసి 40.18 శాతం ఆర్థిక ప్రగతిని సాధించినట్లు కలెక్టర్‌ వివరించారు. ఇందులో ఎంఎస్‌ఎంఈ రుణాలు రూ.524 కోట్లు ఉన్నాయన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందజేయాలని, విద్యారుణాలు, గృహ రుణాలు, పీఎం సూర్యఘర్‌ రుణాలను అవసరమైన మేరకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌ రమణ కుమార్‌, ఆర్‌బీఐ మేనేజర్‌ రోహిత్‌ అగర్వాల్‌, నాబార్డ్‌ ఏజీఎం అనురాధ, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

పట్టపగలే హైడ్రామా!



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్‌ అధికారులు

- సినీ ఫక్కీలో వంద కిలోమీటర్లకు పైగా ఛేజింగ్‌
- గోవా మద్యాన్ని తరలిస్తున్న ముఠా పట్టివేత
- రూ.1,76,904 విలువైన మద్యం స్వాధీనం

అనంతపురం: పట్టపగలే హైడ్రామా నడిచింది. గోవా మద్యం తరలిస్తూ కొందరు యువకులు ఎక్సైజ్‌ అధికారుల కళ్లు గప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో దాదాపు వందకు పైగా కిలోమీటర్ల మేర సినీ ఫక్కీలో ఛేజింగ్‌చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం సాయంత్రం జిల్లా ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ నాగమద్దయ్య, అసిస్టెంట్‌ కమిషనర్‌ వి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ బి.రామ్మోహన్‌రెడ్డి వెల్లడించారు.

అడ్డుకుంటే చంపుతామంటూ...

గోవా నుంచి మద్యాన్ని బుధవారం ఉదయం అక్రమంగా జిల్లాలోకి తరలించుకుని వస్తున్నట్లుగా సమాచారం అందుకున్న ఎక్సైజ్‌ అధికారులు అప్రమత్తమై ఆత్మకూరు మండలం వడ్డుపల్లి టోల్‌ ప్లాజా వద్ద కాపు కాశారు. ఉదయం 10.30 గంటల సమయంలో అటుగా వచ్చిన స్విఫ్ట్‌ కారును అడ్డుకుని పరిశీలిస్తుండగా డ్రైవర్‌ వాకీ టాకీ ద్వారా వెనుక వస్తున్న ఇన్నోవా కారు డ్రైవర్‌ను అప్రమత్తం చేయడం గమనించారు. దీంతో వెనువెంటనే మరో వాహనంలో ఆత్మకూరు వైపుగా ఎక్సైజ్‌ అధికారులు వెళుతుండగా హంద్రీ–నీవా కెనాల్‌ వద్ద ఇన్నోవా కారు ఉన్నఫళంగా వెనక్కు తిరిగి కాలువ గట్టుపై నుంచి శరవేగంగా దూసుకెళ్లింది. దీంతో ఎక్సైజ్‌ అధికారులు తమ వాహనంలో వెంబడించారు. ఒకానొక దశలో ఎక్సైజ్‌ అధికారుల వాహనాన్ని ఢీకొని ముందుకు సాగుతూ ఇనుపరాడ్లను తీసి ప్రదర్శిస్తూ తమను అడ్డుకుంటే చంపుతామంటూ హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఎక్సైజ్‌ అధికారులు వదలకుండా ఇన్నోవా కారును వెంబడిస్తూ వెళ్లారు. చివరకు సాయంత్రం 4 గంటల సమయంలో కర్ణాటక సరిహద్దులోని తిరుమణి వద్ద ఉన్న బాలసముద్రం టోల్‌ ప్లాజా వద్ద ఇన్నోవా కారును అదుపులోకి తీసుకున్నారు.

పట్టుబడింది వీరే..

స్విఫ్ట్‌ కారుతో పాటు, ఇన్నోవాను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్‌ అధికారులు వాటిని జిల్లా ఎక్సైజ్‌ కార్యాలయానికి తరలించారు. రెండు వాకీటాకీలు, మొత్తం రూ.1.76 లక్షల విలువ చేసే హనీగ్రేడ్‌ బ్రాందీ (180 ఎం.ఎల్‌)– 97 బాక్సులు, గోల్డెన్‌ ఏఎస్‌ ఫైన్‌ విస్కీ (180 ఎం.ఎల్‌) – 16 బాక్సులు, మాన్షన్‌ హౌస్‌ బ్రాందీ (750 ఎం.ఎల్‌)– 3 బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తరలిస్తున్న వైఎస్సార్‌ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కె.వీరేంద్ర, డి. ప్రవీణ్‌, కె.వెంకటేష్‌, కె.పవన్‌ కుమార్‌ను అరెస్ట్‌ చేశారు. వీరిలో కె.వీరేంద్రపై మద్యం కేసులు చాలా ఉన్నాయని ఎక్సైజ్‌ అధికారులు తెలిపారు. అయితే ఏనాడూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడలేదన్నారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన ఏఈఎస్‌ వి.శ్రీరాం, ఇన్‌స్పెక్టర్లు కె.అన్నపూర్ణ, ఎస్‌.అలీబేగ్‌, ఎస్‌ఐలు సి.నరేష్‌బాబు, ఎం.హరికృష్ణ, ఎన్‌.సత్యనారాయణ, హెడ్‌ కానిస్టేబుళ్లు రామచంద్ర, ఫణీంద్ర, రమేష్‌బాబు, కానిస్టేబుళ్లు వెంకటనారాయణ, వెంకటప్రసాద్‌, ఎస్‌.మారుతి, ఎం.మారుతి, శివానంద రెడ్డి, నాగముని, చరణ్‌ కుమార్‌, సందీప్‌, ఈఎస్‌టీఎఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ జయనాథ్‌ రెడ్డి, హెచ్‌.ఆర్‌. ప్రసాద్‌ (ఎస్‌ఐ), అనంతపురం ఎక్సైజ్‌ సీఐ సత్యనారాయణను ఆ శాఖ ఉన్నతాధికారులు అభినందించారు.

హుండీ దొంగలు దొరికేరా?

- ఆలయాలనూ వదలని దొంగలు
- సీసీ కెమెరాల కంట పడకుండా చోరీలు



యర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో ధ్వంసం చేసిన హుండీ (ఫైల్‌)

కదిరి అర్బన్‌: కదిరి పట్టణంలో ఇటీవల చాలా ఇళ్లలో చోరీలు జరిగాయి. బంగారం, నగదు దొంగలు దోచుకెళ్లారు. అది చాలదన్నట్లు దేవుడి హుండీపై దొంగల కన్నుపడింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతున్న యర్రదొడ్డి గంగమ్మ ఆలయం హుండీ దొంగతనానికి గురైంది. ఈ నెల 9న అమ్మవారి హుండీని దుండగులు పగులగొట్టి అందులోని నగదు, అమ్మవారి కానుకలు దోచుకెళ్లారు. ఆలయంలో హుండీ ప్రతి 6 నెలలకోసారి లెక్కిస్తారు. రెండు హుండీలు కలిపి సుమారు రూ.6 నుంచి రూ.7 లక్షల వరకు నగదు సమకూరుతుందని ఆలయ అధికారులు చెపుతున్నారు. దుండగులు ఒక హుండీని పూర్తిగా పగులగొట్టి ఎంత లేదన్నా రూ.3 లక్షల వరకు నగదు దోచుకెళ్లి ఉంటారని భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంకో హుండీని సైతం పగులగొట్టేందుకు యత్నించి విఫలమయ్యారు. లేకుంటే సుమారు రూ.8 లక్షల వరకు దోచుకెళ్లేవారు.

పక్కా ప్లాన్‌తోనే జరిగిందా?

ఆలయ పరిసరాల్లో 6 సీసీ కెమెరాలు ఉండగా అందులో ఎక్కడే కాని కనిపించకుండా దుండగులు జాగ్రత్త పడిన తీరు చూస్తుంటే అంతా పక్కా ప్లాన్‌తోనే చేసినట్లుగా స్పష్టమవుతోంది. ఇటీవల ఆలయ పునఃనిర్మాణ పనుల్లో భాగంగా గర్భ గుడి గోడలకు చలువరాతి బండలు ఏర్పాటు చేస్తుండడంతో అక్కడి సీసీ కెమెరాను తొలగించారు. ఆలయం గురించి బాగా తెలిసిన వారే రెక్కీ నిర్వహించి ఎటునుంచి ప్రవేశిస్తే సీసీ కెమెరాల్లో పడకుండా ఉంటారో గుర్తించి అటుగా వచ్చి పని కానిచ్చేశారు.

గత ప్రభుత్వంలో రూ.1.25 కోట్లతో అభివృద్ధి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యర్రదొడ్డి గంగమ్మ ఆలయాన్ని రూ.1.25 కోట్ల కామన్‌ గుడ్‌ఫండ్‌ (సీజీఎఫ్‌) నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఆలయ కాంట్రిబ్యూషన్‌ కింద రూ. 25 లక్షలు చెల్లించగా.. సీజీఎఫ్‌ కింద రూ. కోటి నిధులు మంజూరయ్యాయి.

విచారణ చేస్తున్నాం



యర్రదొడ్డి గంగమ్మ ఆలయ హుండీ చోరీ కేసులో అనుమానితులను విచారణ చేస్తున్నాం. ఫోరెన్సిక్‌ టీం ఇప్పటికే ఫింగర్‌ ప్రింట్‌ ఆధారాలు సేకరించింది. త్వరలోనే దొంగలను పట్టుకుంటాం. – నిరంజన్‌రెడ్డి, కదిరి రూరల్‌ అప్‌గ్రేడ్‌ పీఎస్‌ సీఐ

● జగనన్నతో భేటీ



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్‌ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్‌, హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్‌ దీపిక, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతి రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

యువకుడి దుర్మరణం



గంగాధర్‌నాయుడు (ఫైల్‌)

ఎన్‌పీకుంట: బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు తెలిపిన మేరకు... ఎన్‌పీకుంట మండలం పల్లెనాయునివారిపల్లికి చెందిన పల్లేని గంగాధర నాయుడు (36)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో గంగాధరనాయుడు బుధవారం ఉదయం అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం ఇందుకూరోళ్లపల్లి వద్ద ఉన్న పెట్రోల్‌ బంక్‌ వద్ద క్యాన్‌లో డీజిల్‌ పట్టుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. జిల్లా సరిహద్దుకు చేరుకోగానే మలుపు వద్ద వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన బొలెరో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, 16 రోజుల క్రితం గంగాధరనాయుడు తండ్రి, విశ్రాంత ఉపాధ్యాయుడు వీరమల్లప్ప నాయుడు మృతి చెందారు. 16 రోజుల వ్యవధిలోనే తండ్రి, కొడుకు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఇద్దరు కుమార్తెలతో కలిసి తల్లి అదృశ్యం

రాప్తాడు: మండలంలోని గాండ్లపర్తికి చెందిన సాకే పోతులయ్య భార్య, ఇద్దరు కుమార్తెలు కనిపించడం లేదు. సీఐ టీవీ.శ్రీహర్ష తెలిపిన మేరకు.. రాయదుర్గం మండలం గ్రామదట్ల గ్రామానికి చెందిన వన్నూరు స్వామి కుమార్తె పద్మలతకు గాండ్లపర్తి గ్రామానికి కొండన్న కుమారుడు సాకే పోతులయ్యతో 2021 సెప్టెంబర్‌ 21న వివాహమైంది. పోతులయ్య ఆటో తోలుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ నెల 22న ఉదయం పద్మలత తన భర్తకు తెలపకుండా ఇద్దరు కుమార్తెలను తీసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి వారి కోసం కుటుంబసభ్యులు గాలిస్తున్నారు. ఆచూకీ లక్ష్యం కాకపోవడంతో మంగళవారం రాత్రి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96817కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

బుక్కపట్నంలో చోరీ

పుట్టపర్తి టౌన్‌: బుక్కపట్నంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో నివాసముంటున్న వర సిద్ధార్థ ఇంట్లో చోరీ జరిగింది. సాఫ్ట్‌వేర్‌ కంపెనీలో పనిచేస్తున్న సిద్ధార్థ తన భార్యాపిల్లలతో కలసి హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. తండ్రి మరణానంతరం తల్లి ఒక్కతే బుక్కపట్నంలో నివాసముంటోంది. ఈ క్రమంలో వారం రోజుల కిత్రం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని కుమారుడి వద్దకు తల్లి వెళ్లింది. తాళం వేసిన ఇంటిని గుర్తించిన దుండగులు మంగళవారం రాత్రి బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలోని 8 తులాల బంగారం, 250 గ్రాముల వెండి, విలువైన చీరలు అపహరించారు. బుధవారం ఉదయం విషయాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో సిద్ధార్థ ఇంటికి చేరుకుని పరిశీలించి, ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మట్కా బీటర్ల అరెస్ట్‌

గుత్తి: స్థానిక అమృత్‌ సినిమా థియేటర్‌ వెనుక ఉన్న ఎస్సీ కాలనీలో మట్కా రాస్తూ ముగ్గురు బీటర్లు పట్టుబడినట్లు ఎస్‌ఐ సురేష్‌ తెలిపారు. అందిన సమాచారం మేరకు బుధవారం తనిఖీలు చేపట్టిన సమయంలో మట్కా రాస్తూ రామాంజనేయులు, రాము, యల్లమ్మ పట్టుబడ్డారన్నారు. బీటర్లను అరెస్ట్‌ చేసి, వారి నుంచి రూ.25,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

వివాహిత హత్య కేసులో భర్త అరెస్ట్‌

పెనుకొండ: వివాహత హత్య కేసులో మిస్టరీని ఛేదిస్తూ ఆమె భర్తను పోలీసులు అరెస్ట్‌ చేశారు. పెనుకొండ పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను సీఐ రాఘవన్‌, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. పెనుకొండలోని న్యూ రెవిన్యూ కాలనీలో నివాసముంటున్న రెవెన్యూ విశ్రాంత ఉద్యోగి డి. ఫజులుల్లా ఖాన్‌ కుమారుడు అల్తాఫ్‌ఖాన్‌ మద్యానికి బానిసగా మారి తన భార్య సుమయభానుపై అనుమానాలు పెంచుకున్నాడు. ఈ క్రమంలో జూన్‌ 26న సుమియ భాను పనిచేస్తున్న ప్రైవేట్‌ పాఠశాల వద్దకు అల్తాఫ్‌ఖాన్‌ వెళ్లి భార్య, పిల్లలను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని స్థానిక కుర్ది కాంప్లెక్స్‌లో తాను నివాసముంటున్న అద్దె ఇంటికి పిలుచుకెళ్లాడు. కాసేపటి తర్వాత భార్యతో గొడవ పడి ఇనుపరాడ్‌తో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రికి ఆమెను తీసుకెళ్లి చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించాడు. అదే రోజు బాధితురాలి అక్క, బావ, వాళ్ల అమ్మ అక్కడకు చేరుకోవడం గమనించిన అల్తాఫ్‌ ఖాన్‌ పరారయ్యాడు. క్షతగాత్రురాలని మెరుగైన వైద్యం బెంగళూరులోని ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఈ నెల 12న బెంగళూరులో ఆమె మృతి చెందింది. ఘటనపై బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి, బుధవారం ఉదయం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ప్రధాన పంటగా కంది



అనంతపురం అగ్రికల్చర్‌: జిల్లాలో కంది ప్రధాన పంటగా అవతరిస్తోంది. గత కొన్ని దశాబ్దాలుగా ఏక పంటగా లక్షలాది హెక్టార్లలో సాగవుతూ వస్తున్న వేరుశనగను వెనక్కినెట్టి కంది తొలిస్థానాన్ని ఆక్రమిస్తోంది. గత నాలుగైదు సంవత్సరాలుగా జిల్లా రైతులు కంది సాగుపై మొగ్గుచూపడమే ఇందుకు కారణం. 2024 ఖరీఫ్‌లో ఏకంగా 1.03 లక్షల హెక్టార్లలో కంది సాగులోకి రాగా ఈ ఖరీఫ్‌లో కూడా 1.01 లక్షల హెక్టార్లకు చేరుకుంది. ఈ–క్రాప్‌ ముగిస్తే కంది విస్తీర్ణం మరికొంత పెరిగే అవకాశమున్నట్లు సమాచారం. జిల్లా చరిత్రలో తొలిసారిగా కంది పంట వేరుశనగను దాటిపోవడం ఇదే తొలిసారి. గతేడాది కంది విస్తీర్ణం పెరిగినా... వేరుశనగను అధిగమించలేకపోయింది. ఈ సారి కంది తొలిస్థానంలో నిలవడం విశేషం. కంది సాధారణ సాగు విస్తీర్ణం 55,296 హెక్టార్లు కాగా 183 శాతంతో 1.01 లక్షల హెక్టార్లకు చేరుకుంది. గతంలో ఉమ్మడి జిల్లాలో కూడా ఈ స్థాయిలో కంది ఎన్నడూ సాగులోకి రాలేదు. ఉమ్మడి జిల్లాలో 2017లో అత్యధికంగా 71 వేల హెక్టార్లుగా నమోదైంది.

లక్ష హెక్టార్లలోపే వేరుశనగ

గత నలభైయేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి వేరుశనగ సాగు విస్తీర్ణం లక్ష హెక్టార్ల లోపే పరిమితమైంది. ఈ సారి 1.82 లక్షల హెక్టార్లు అంచనా వేయగా అతి కష్టంపై 89 వేల హెక్టార్లకు చేరుకుంది. పెట్టుబడులు పెరగడం, కూలీల సమస్య, అననుకూల వర్షాల వల్ల పంట దిగుబడులు తగ్గిపోవడం, చివరికి గిట్టుబాటు ధరలు కూడా లేకపోవడం, చీడపీడల వ్యాప్తి, అడవిపందులు, జింకల బెడద తదితర కారణాలతో వేరుశనగ పేరు వింటనే రైతులు బెదిరిపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. అలాగే నల్లరేగడి భూముల్లో పత్తి విస్తీర్ణం 44 వేల హెక్టార్లు అంచనా వేయగా అదనులో వర్షం పడకపోవడంతో 24 వేల హెక్టార్లకు పరిమితమైంది.